## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-09-2007, అయిభీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాధ, కృష్ణుడు మనకు వేరుగా కనిపిస్తున్నారు కాని కృష్ణుడే రాధ రూపంలో వచ్చాడు. రాధ వేరు, కృష్ణుడు వేరు కాదు. భగవంతుడిని ఎలా ప్రేమిస్తే, భగవంతునియందు మన మనస్సు, బుద్ధి ఈ రెండింటిని ఎలా నిలబెడితే ఆయన అనుగ్రహాన్ని మనం సంపాదించగలమో కృష్ణుడే రాధరూపంలో వచ్చి మనకు చేసి చూపించాడు. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే రాధ కృష్ణుడి యొక్క భక్తురాలు, ప్రేమికురాలు అని అనుకొంటాము, రాధ కృష్ణుడి కంటే భిన్నం కాదు. భగవంతుడిని ఎలా ఆరాధిస్తే ఆయనను పొందగలమో కృష్ణుడే రాధ రూపంలో వచ్చి మనకు చూపించాడు. రాధ సాధన, కృష్ణుడు సాధ్యం. మనం సాధన చేసి కృష్ణుడిని ఎలా పొందాలో రాధ రూపంలో చూపించాడు. వేదంలో కర్మకాండ గురించి ఎక్కువ చెప్పారు, ఉపనిషత్‌లలో జ్ఞానం గురించి ఎక్కువ చెప్పారు. వీటి అన్నింటిని సమన్వయం చేసి పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. అహంకారం లేకుండా మనిషి ఉండడు. అందుచేత మనిషి చెప్పేమాట ప్రమాణం కాదు. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని నడుచుకొంటే నన్ను పొందుతావు అంటే మోక్షాన్ని పొందుతావు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనుషుల ప్రేమ నమ్మటానికి వీలులేదు. వాతావరణం ఎటువంటిదో మనుషుల ప్రేమ అటువంటిది అని శాస్త్రంలో చెప్పారు. వాతావరణం ఇప్పుడు ఒకలాగ ఉంటుంది, ఇంకో గంటలో ఎలా ఉంటుందో చెప్పలేము. భగవంతుని ప్రేమలో చపలత్వం ఉండదు, మనిషి ప్రేమలో చపలత్వం ఉంటుంది. ఒక్క భగవంతుడి ప్రేమే మనం నమ్మదగినది. మనకు తల్లీ, తండ్రీ, స్నేహితుడు, సాధన, మోక్షం సమస్తము ఆయనే. అయితే మనకు భగవంతుని యందు గౌరవం లేదు. ఇంట్లో చాకిరి చేయలేకపోతున్నాము అని చాలామంది అంటారు, సమాజంలో ఎవరికైనా కొద్దిగా ఉపకారం చేస్తే ఈ సమాజాన్ని మేమే ఉద్ధరిస్తున్నాము, ఈ దేశాన్ని మేమే ఉద్ధరిస్తున్నాము అని చెప్పకొంటారు. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నిజమైన భక్తుడు, కర్మయోగి డాంబికం కోసం పనిచెయ్యడు. కొంతమంది ధర్మాన్ని ఆచరిస్తారు కాని డాంబికం కోసం, ఇతరులు గొప్పగాచెప్పకోవాలి అని ఆచరిస్తారు. వాళ్ళకి ఈ లోకంలో గౌరవం వస్తుంది కాని మరణానంతర జీవితం సున్న. చాలామంది లౌకికులు డాంబికం కోసం పనులు చేస్తారు, ధర్మం మనలను ఉద్ధరిస్తుందని, ధర్మంయందు గౌరవం ఉండి ధర్మాన్ని ఆచరించటం లేదు, గొప్పలకోసం ఆచరిస్తారు. నిజమైన

భక్తుడు ఇతరులపట్ల ఉన్న ప్రేమను పని రూపంలో చూపిస్తాడు అని పరమాత్మ చెప్పాడు. తోటి మానవుల పట్ల, సమాజంపట్ల ఉన్న ప్రేమను ఏవో బజారు మాటలతో కాకుండా వారి కోసం పనిచేసి ఎవడైతే చూపిస్తున్నాడో, అది నిజమైన పని, వాడు నిజమైన భక్తుడు. ఆ పని వలన జీవుడు పవిత్రుడవుతాడు, వాడు తరిస్తాడు. నువ్వు ఏది చేసినా, ఎవరికి చేసినా నీకు ఉన్న ప్రేమను పనిరూపంలో ఎవడైతే చూపిస్తున్నాడో, వాడు కర్మయోగి, వాడు శరీరాన్ని విడిచిపెట్టిన వెంటనే నన్ను పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు, దానిని క్రమముక్తి అంటారు. పని కూడా ప్రేమే. ప్రేమను పని రూపంలో ఎవడైతే చూపిస్తున్నాడో వాడు యోగి. అంటేవాడు కర్మను ఖర్మ అన్నట్లు కాకుండా యోగంగా చేస్తున్నాడు, వాడు తరిస్తాడు. కృష్ణుడు సర్వదేవతల స్వరూపం. అచ్యుతం, అనంతం, గోవిందం, కేశవం, జగన్నాథం, రామం, నారాయణం. అంటే ఆ కేశవుడికి పెట్టే నమస్కారం అందరి దేవతలకు అందుతుంది. అహంకారం ఉన్న మనిషి ఎలా ఉంటాడు అంటే మన కుటుంబ సభ్యులు, మన గ్రామంలో ఉన్న జనం, దేశంలో ఉన్న జనం అంతా నాచేతిలో ఉండాలి, నామాట వినాలి అనుకొంటాడు, వాడే అహంకారి, వాడే రాక్షసుడు.

కృష్ణుడిని తీసుకొనిరమ్మని కంసుడు అక్రూరుడిని పంపుతాడు. కబురు ఎప్పుడు వస్తుందా అని బలరాముడు, కృష్ణుడు కనిపెట్టుకొని ఉన్నారు. బృందావనం విడిచిపెట్టి వెళ్ళవద్దని గోపికలు అంటారు. చిరిగిపోయిన బట్టలను మనిషి ఎలా విడిచిపెట్టేస్తాడో అలాగ మమ్మల్ని విడిచిపెట్టి నువ్వు వెళ్ళిపోతున్నావు కృష్ణా అంటుంది రాధ. గోపికల ప్రేమ మనకు అర్థం కాదు. గోపికల ప్రేమలో కోరికలు లేవు. మన ప్రేమలో కోరికలు ఉంటాయి. మనం గుడికి వెళితే, తిరుపతి వెళితే, కాశీ వెళితే, అరుణాచలం వెళ్ళి గిరిప్రదక్షిణ చేస్తే ఏమీ కోరుకోకుండా రాము. మనం శుభ్రంగా పాడైపోయి ఉన్నాము. అలాగని ఒక ప్రక్కన పడి ఉంటే పరవాలేదు, గోపికలను విమర్శిస్తున్నాము. గోపికలు పరమపవిత్రులు, కోరిక ఎలా ఉంటుందో వారికి తెలియదు. బుద్ధిలేని మనం బుద్ధి ఉన్నవారిని విమర్శించటం. ఇక్కడ ఇంతమంది ఉన్నారు. ఏ రకమైన కోరిక లేకుండా భగవంతుడిని భగవంతుడి కోసమే అర్చన చేసేవారు, ఆయనను ధ్యానించేవారు మీలో ఒక్కరు ఉన్నారేమో చెప్పండి, మీరు గోపికలను విమర్శించటం ఏమిటి? వారు మహర్షులు, యోగులు. మనం పుట్టినప్పుడు గుణాలతో పుడతాము, మాయతో పుడతాము. నూటికి నూరుపాళ్ళు మాయలో ఉంటాము, మాయలోనే చనిపోతాము. భగవంతుడు పుట్టినప్పుడు పుట్టుక అనరు, అవతారం అంటారు.

ఆయన ఎందుకు పుడుతున్నాడు అంటే దుష్టశిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం ఆయన అవతరిస్తాడు. మానవజాతిపట్ల ప్రేమ వలన పుట్టటంకాని, పని ఉండి పుట్టటం కాదు. కృష్ణుడు చేసే ప్రతీపని ప్రేమే, శాంతే, ఆనందమే, వైభవమే. కృష్ణుడు బృందావనంలో ఉన్నాడు అనుకొంటున్నారు, ఆ కృష్ణుడు ఇక్కడ ఉన్నాడు, మన హృదయంలో అంతర్యామిగా కూడా ఉన్నాడు. మనకు సాధనాబలం లేదు అందుచేత ఆయన మనకు వ్యక్తం కావటంలేదు. మనం నూటికి నూరుపాళ్ళు లౌకికులం, లోకం వాసన లేకుండా ఎవరు ఉన్నారు? ధర్మాన్ని ఆచరించటం కూడా డాంబికం కోసం చేస్తూ ఉంటే అది లౌకికత్వమే. భగవంతుడు పూర్ణకాముడు. సంవత్సరానికి ఎన్ని పూర్ణిమలు వస్తాయో అన్ని పూర్ణిమలు ఒక్కరోజున వచ్చేస్తే ఆ పూర్ణిమ ఎంత అందంగా ఉంటుందో, ఎంత బలంగా ఉంటుందో కృష్ణుడి అవతారం అటువంటిది. మనం గుణాలతో పుడతాము, ఆయన గుణాలు లేకుండా పుడతాడు. ఆయన చేసేపని ఆయనను బంధించదు, మనం చేసే పని మనలను బంధిస్తుంది. మనం కోరికతో పనిచేస్తాము, పనికి ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని అనుభవించాలి అనుకొంటాము, అనుభవించటానికి శరీరం కావాలి. శరీరం వస్తే దుఃఖం రాకుండా ఎవడూ ఆపలేడు. మనం పనిచేస్తాము కాని స్వార్థాన్ని నెరవేర్చుకోవటానికి చేస్తాము. భక్తులు, యోగులు వారి ప్రేమను పనిరూపంలో చూపిస్తారు. భగవంతుడి యొక్క జన్మ రహస్యం అంటే పుట్టినా పుట్టని వానితో సమానము. ఆయన కర్మ రహస్యం అంటే ఏ పని చేసినా చెయ్యనివాడితో సమానము. ఆయన అలౌకికుడు. ఆయన జన్మ అలౌకికం, ఆయన చేసేపని అలౌకికం. ఇది బాగా అర్థం చేసుకొన్నవాడు జన్మరాహిత్యాన్ని పొందుతాడు.

భగవంతుడి నామాన్ని శ్రద్ధగా చేస్తూ ఉంటే వాడి శరీరం పవిత్రం అవుతుంది, మనస్సు పవిత్రం అవుతుంది, బుద్ధి బాగుపడుతుంది. పరమపవిత్రులు కానివారు ఈశ్వరునిలో ఐక్యం పొందలేరు. మనకు ఎంతోకొంత భక్తి ఉన్నమాట నిజమే కాని మనకు ప్రాపంచిక జ్వరం ఎక్కువగా ఉంది. మనకు దేవుడికి సంబంధించిన పిచ్చిలేదు గాని ప్రాపంచిక పిచ్చి నూటికి నూరుపాళ్ళు ఉంది. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు మనకు అర్థం కావు. ఆయన చెప్పిన మాటలు మన మనస్సుకు అందదు. మనం ఎక్కడ పాడైపోతున్నాము అంటే భగవంతుడు ఈ మాట చెప్పాడు, అయ్యో ఈ మాట మనకు అర్థం కావటం లేదు, దానిని అర్థం చేసుకొనే పుణ్యబలం మనకు లేదు, ఆ బుద్ధిసూక్ష్మత మనకు లేదు, ఆ ఏకాగ్రత మనకు లేదు అని అనుకోవటం మానివేసి, ఈ మాటలు అన్నీ వ్యర్థం, దీని వలన టైము వేస్టు

అనుకొంటున్నాము. భగవంతుడు అందరిలోను అంతర్యామిగా ఉన్నాడు. నీ ప్రాణానికి ప్రాణాన్ని నేను, నీ కర్మ సాక్షిని నేను అని భగవంతుడు చెప్పాడు. నీకు ఏ తలంపు వచ్చినా అది ప్రక్కవాళ్ళకు తెలియదు కాని భగవంతుడికి వెంటనే తెలుస్తుంది. ఎందుచేతనంటే మీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మన దృష్టిలో పెద్దపని, చిన్నపని అని ఉంటుంది గాని ప్రేమ ఉన్నవాడికి అన్ని పనులు సమానమే. మనం చేసే పనులు భగవంతుడు చూడడు, ఆ పని చేసేటప్పుడు మన లోపల భావన చూస్తాడు. చిత్తశుద్ధి లేకుండా మోక్షం రాదు అని పరమాత్మ చెప్పాడు. మీరు ఏ యోగం అవలంభించినా చిత్తశుద్ధిని పొందాలి. రాధ నన్ను ఎలా ప్రేమించిందో అలాగ ప్రేమించటం వలన ఇమీడియట్‌గా విమాన ప్రయాణం కంటే వేగంగా నీకు చిత్తశుద్ధి కలుగుతుంది అని పరమాత్మ చెప్పాడు. పనిని చాకిరీగా చేసిన వాడికి దాని తాలుక ఫలితం చుట్టుకొంటుంది, పనిని ప్రేమగా చేసినవాడు యోగి అవుతాడు.

గృహస్థులకు మోక్షం వస్తుందా లేక వారు సన్యాసం తీసుకోవాలా అని భగవాన్‌ను అడుగుతున్నారు. గృహస్థాశ్రమంలో ఉన్నవాడు నేను గృహస్థుడను, ఈ సంసారయాత్ర మోయలేకపోతున్నాను అంటాడు. ఎర్రబట్టలు వేసుకొన్నవాడు నేను సన్యాసిని, నేను స్వాముల వారిని నాకు పాదపూజలు ఎవడు చేస్తాడు అని కనిపెట్టుకొని ఉంటున్నాడు, బ్రహ్మచర్యం అవలంభించినవాడు నేను బ్రహ్మచారిని, నేను బ్రహ్మచారిని అంటాడు. అంటే గృహస్థుడికి నేను ఉంది, సన్యాసికి నేను ఉంది, బ్రహ్మచారికి నేను ఉంది, ఆ నేనులో నుండి ఎవడూ బయటకు రాలేదు. అందుచేత ముగ్గురికి మోక్షం లేదు. పోగొట్టుకోవలసింది ఏదో దానిని పోగొట్టుకోవాలి. మీరు సన్యాసి అయినా, గృహస్థు అయినా లోపల అజ్ఞానం పోవాలి. ఆత్మజ్ఞానం కలిగేవరకూ అజ్ఞానం నశించదు. మనం పని మొదలుపెడితే మన అహంకారం అంతా కర్తృత్వం కింద మారిపోతుంది. భగవంతుడికి అహంకారం లేదు కాబట్టి కర్తృత్వం లేదు. కర్తలేని కర్మ చేసేవాడు మూడు లోకాలను భస్మం చేసినా వాడికి పాపంలేదు. ఆడించేవాడు భగవంతుడు, మనం ఆడే బొమ్మలం. ఎవడు ఏ పని చేస్తున్నా ఆడించేవాడు ఆయనే అని మర్చిపోవటం వలన ఇలా సంసారంలో పడి ఉన్నాము. ఈ శరీరం అనే బొమ్మలు ఆయన ఎలా ఆడమంటే అలా ఆడతాయి. ఎవరిమటుకు వాళ్ళు నేను ఆడుతున్నాను, నేను ఆడుతున్నాను అంటే ఇంతమంది ఉన్నారా? లేరు. ఆడించేవాడు ఆయన ఒక్కడే భగవంతుడి యొక్క అనుగ్రహం వలన కాని ఈ విషయం మనకు అర్థం కాదు. మహాత్ములను, సత్పురుషులను మనకు చేతనైతే గౌరవించాలి కాని వారిని అగౌరవపరచకూడదు. వారిని

అగౌరవపరిస్తే దానికి రెట్టింపు మనం అనుభవించవలసి ఉంటుంది. ఒకోసారి సంపదలు ఎక్కువ అవ్వటం వలన కూడా మనం పాడైపోతాము. సంపదను మనం నిగ్రహించుకొంటే ఫరవాలేదు, నిగ్రహించుకోలేకపోతే చెడ్డఅలవాట్లలోనికి పోతాము. మనకు ప్లస్ పాయింట్లు వచ్చినప్పుడు నిగ్రహించుకోకపోతే ప్రమాదంలో పడతాము. కొంతమందికి భగవంతుడే సంపద, ఏమీలేని వారు మాకు ఏమీ లేదు అనుకోనక్కరలేదు, వారికి భగవంతుడే సంపద. కొంతమందికి దుఃఖం వచ్చినా దానిని మంచిగా మలచుకొంటారు. చనిపోయినవారిని, ముసలివారిని చూసి బుద్ధుడికి వైరాగ్యం వచ్చి గౌతమబుద్ధుడు అయ్యాడు, అర్జునుడికి దుఃఖం లేకపోతే భగవద్గీత లేదు.

ఈశ్వరసంకల్పం ప్రకారం ఈ సృష్టి నడుస్తోంది. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు అయితే నీకు శరణాగతి లేదు. ఎవరు ఎప్పుడు చనిపోవాలో అప్పుడు చనిపోతారు. నువ్వు తెలుసుకోవలసినవాడు ఎక్కడో దూరాన లేడు, నీ హృదయంలోనే ఉన్నాడు. వాడిని తెలుసుకొంటే నీ జన్మ సఫలం అవుతుంది. నీవు అన్నివిధాలుగా ప్రయత్నం చేసి, నీకు ఉన్న అన్ని అవకాశములను ఉపయోగించుకొని నీ లోపలఉన్న ఈశ్వరుడికి శరణాగతి చెంది ఆయనను తెలుసుకోవయ్యా అంటున్నాడు పరమాత్మ, మన హృదయంలో ఉన్న నిజమైన నేను మనకు తెలియటం లేదు కాబట్టి ఈ మనస్సే నేను అనుకొంటున్నాము, అక్కడ నుండి విషాదం ప్రారంభమవుతోంది. మనస్సే నిజం అనుకోవటం వలన నిజమైన నేను కోసం మనం ప్రయత్నం చేయటం లేదు. ఈ సృష్టినంతా ఆడించేవాడిని కాదని నీవు ఒక్క పని చేయగలవా? నువ్వు స్వతంత్రుడివా చెయ్యటానికి? భగవంతుడి సంకల్పం ప్రకారం యాక్టు చేయటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము, అంతా ఆయనే, జరిగేది ఈశ్వరసంకల్పమే. మన హృదయంలో నారాయణుడు ఉన్నాడు, ఆయన మనకు అనుభవంలోనికి రాకుండా మనలోని వాసనలు, సంస్కారాలు అడ్డువస్తున్నాయి. విశ్వరూపదర్శనం అప్పుడు ఈ భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మొత్తం సృష్టి అంతా ధరించింది నేనే, నేనే ఇలా కనిపిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. ఇది అంతా అబద్ధం అని మనం అనుకొంటాము. దానికి మనలో ఉన్న పాపం కారణం. విశ్వాన్ని విశ్వేశ్వరుడిగా మనం చూడలేకపోతున్నాము. విష్ణుసహస్రనామాలలో మొదటిది విశ్వం. నిరంతరం నన్ను స్మరించటం వలన నిన్ను పాపరహితుడ్ని చేస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. మన మనస్సు ఈగలాంటిది. ఈగలు చూడండి కొద్దిసేపు మిఠాయి మీద వాలుతాయి, తరువాత

ప్రక్కనే ఉన్న మలంమీద వాలుతాయి. మన మనస్సు కూడా అంతే కొద్దిసేపు రామ, రామ అంటుంది. మరల ప్రకృతి విషయాల మీద వాలుతూ ఉంటుంది. అలా నీ మనస్సు రకరకాలుగా వాలకుండా అనన్యచింతనతో నిరంతరం నన్నే స్మరిస్తూ ఉంటే నువ్వు తరిస్తావు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం కూడా అప్పుడప్పుడు దేవుడిని తలపెట్టుకొంటాము. ఏవో మోకాళ్ల నొప్పులు వచ్చినప్పుడో, ఇంట్లో పెళ్లిళ్లు ఆలస్యం అయినప్పుడో, రోగాలు వచ్చినప్పుడో, ఏవైనా కష్టాలు వచ్చినప్పుడో భగవంతుడిని స్మరిస్తాము. మనది కారణభక్తి. కారణభక్తి వలన మనకు భగవంతుడు లభ్యంకాడు, మీ కోరికలు నెరవేరవచ్చు. అకారణ భక్తి ఉంటే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. భక్తివలన, ప్రేమ వలన భగవంతుడు స్వాధీనమవుతాడు.

మోక్షంకోసం మనం చేసే ప్రయాణంలో వచ్చే అవరోధాలను మనం తొలగించుకోలేము. మనం పనిచేస్తూ ఉండాలి, ఆయన అనుగ్రహం రావాలి. ఆయన అనుగ్రహం వలన కాని మనకు ఉన్న అలవాట్లలోనుండి, బలహీనతలలోనుండి మనం బయటకు రాలేము. మనం చేసే ప్రయత్నాలద్వారా మనస్సును పెంచుకొంటున్నాము. మనోనాశనం అయితేగాని పరమాత్మ మనకు లభ్యంకాడు. కృషి ఒక్కటే సరిపోదు, పరమాత్మ అనుగ్రహం ఉండాలి. పరమాత్మ అనుగ్రహం లేకుండా కేవలం మన తెలివితేటల వలన ఒడ్డుకు రాలేము. అనన్యచింతనవలన నీలో ఉన్న దోషాలు అన్నీ రాలిపోతాయి. నీ బుద్ధి పవిత్రమవుతుంది, మనస్సు నిర్మలమవుతుంది. వసుదేవుడి బుద్ధి పవిత్రమైనది, దేవకి మనస్సు నిర్మలమైనది. ఎక్కడైతే బుద్ధి పవిత్రంగా ఉందో, మనస్సు నిర్మలంగా ఉందో అక్కడ భగవంతుడు అవతరించాడు. నీవు ఎర్రబట్టలు కట్టుకొన్నావా, నీవు గృహస్థుడవా, నీవు బ్రహ్మచారివా అనేది ముఖ్యంకాదు, నీవు ఇంటి దగ్గర ఉన్నా మనోనాశనం అవుతోందా అనేది ముఖ్యం. నీ మనస్సు చిరిగిపోయిందా లేదా అనేది ముఖ్యం. బట్టలు చిరిగిపోయినంత తొందరగా మనస్సు చిరగదు. ఎందుచేతనంటే వేలాదిజన్మల నుండి పోగుచేసుకొన్న అలవాట్లు, వాసనలు అన్నీ మనస్సులో ఉంటాయి. వాడు ఏమతస్థుడైనాగాని మనోనాశనం అవ్వకుండా ఎవడికీ మోక్షం రాదు. అన్ని శరీరాలు ఒకే పనిచెయ్యవు. మనం రకరకాల పనులు చేస్తున్నాము. ఇది నేను చేస్తున్నాను అనే భావనను ప్రక్కనపెట్టి మీ పని మీరు చేసుకోండి. అప్పుడు మనస్సు తొందరగా చిరిగిపోతుంది. ఎప్పుడైతే నీ మనస్సు చిరిగిపోయిందో లోపల ఉన్న పరమాత్మ నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు, అదే నీ కడసారి జన్మ, ఇంక శవాలను మోయవలసిన పని లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| అక్టోబర్ | 18 | శృంగవృక్షం, కనకదుర్గ గుడి వద్ద |
| అక్టోబర్ | 20 | బూరుగుపల్లి, వయా దొడ్డిపట్ల |
| అక్టోబర్ | 21 | నరసాపురం, వై.ఎన్. కళాశాల ఆడిటోరియం |
| నవంబర్ | 01 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**ది|| 28-08-2007న గణపవరంలోని**

**శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల**

**సందర్భముగా ప||గో|| జిల్లా కలెక్టర్**

**శ్రీమతి జి. జయలక్ష్మిగారిని సత్కరిస్తున్న**

**సద్గురు శ్రీ నాన్నగారు**



ది॥ 28-08-2007న గణపవరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల సందర్భముగా నటరాజ విగ్రహాన్ని ఆవిష్కరించిన సద్గురు శ్రీ నాన్నగారు



ది॥ 28-08-2007న గణపవరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల సందర్భముగా సంఘ సభ్యులకు స్వర్ణోత్సవ జ్ఞాపికలను బహూకరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు